క్లుప్తంగా...

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు దీర్ఘకాలిక రుణాలను చైర్మన్ బి.సతీష్ అందజేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిలో భాగంగా గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలు కోసం రైతులకు ఈ రుణాలను అందజేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. తాజాగా రూ.62,38,400 రుణాల చెక్కులను పంపిణీ చేయగా.. ఇప్పటి వరకు సొసైటీ పరిధిలో 89 మంది రైతులకు రూ.3.59కోట్లు రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభుసాగర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం



విద్యా వాలంటీరుకు వేతనాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ సంగీత సిద్దేశ్వర్

శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని ఎంపీటీసీ సభ్యురాలు యాటకారి సంగీత సిద్దేశ్వర్ అన్నారు. పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న విద్యా వాలంటీరుకు చెల్లించే 10 నెలల వేతనాన్ని తన సొంత డబ్బు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును అశ్రద్ధ చేయకుండా మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదు



శంషాబాద్: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని ఐదోవార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో కళ్లపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, కౌన్సిలర్ ముస్రత్‌జాన్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గచ్చిబౌలి: రఘునాథ్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కొండాపూర్‌లోని ఎఫ్‌సీఏ గ్రౌండ్స్‌లో రఘునాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్ పోటీలను ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 టీమ్‌లు పోటీలో పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్, రెజ్లర్ గీత, మాజీ క్రికెటర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

గన్‌ఫౌండ్రీ: దళితుల అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. అఖిలభారత అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దళిత బంధుతో కలిగే ప్రయోజనాలపై రూపొందించిన ప్రాజెక్ట్ ఫైల్‌ను సోమవారం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌పై నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులకు వ్యాపార అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దళితబంధు ఎంతో గొప్ప పథకం అని ఆ పథకంతో కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి

గోల్కొండ: సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధిపై సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కార్వాన్‌లో ఇప్పటి వరకు మంజూరైన అభివృద్ధి పనుల నిధులు, వాటితో పూర్తి అయిన పనుల విషయంపై అడిగి తెలుసుకున్నారు. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పని తీరును మరింత మెరుగుపరచాలని, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ ఏరియా ఆస్పత్రి పని తీరుపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆయన కోరారు. అదే విధంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆయన అన్నారు. ఏరియా ఆస్పత్రికి మరిన్ని ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, దాని కోసం నిధులు కేటాయిస్తానని ఆయన అన్నారు. కాగా కార్వాన్ నియోజకవర్గానికి మంజూరైన రూ.300 కోట్ల డ్రైనేజీ పనులు జోరుగా నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. హకీంపేట్ నుంచి బుల్కాపూర్ నాలా మళ్లింపు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు.

నిరుపేదలకు వరం జకాత్

- ఇస్లాం ఐదు మూలసిద్ధాంతాలలో జకాత్ ఒకటి
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర నరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: రంజాన్ మాసంలో నిరుపేదలకు జకాత్ వరంలాంటిది. జకాత్ విషయం తెలిసిన వెంటనే వందల సంఖ్యలో పేదలు క్యూ కడతారు. ఇస్లాం ఐదు మూల సిద్ధాంతాల్లో జకాత్ ఒకటి. ఓ స్థాయి దాటి డబ్బులు కలిగి ఉన్న ప్రతీ ముస్లింపై జకాత్ ఉంటుంది. ఎవరికైతే డబ్బు అవసరమో వారికి ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా ఆదుకోవడమే జకాత్. జకాత్ అంటే 'శుభ్రపరుచుట' అని అర్థం. అంటే ధనాన్ని శుభ్రపరచుకోవడం. ముస్లింల వద్ద ఎవరి దగ్గర ఎంత ధనమున్న దానిలో వేరే వారి హక్కు కూడా ఉంటుందని ఇస్లాం చెబుతోంది. మొత్తం ధనంలో 2.5 శాతం జకాత్ చెల్లించడం తప్పనిసరి. అంతేకాకుండా డబ్బును లేదా దాని ద్వారా కొన్న వస్తువును నిరుపేదల కోసం పని చేసే సంస్థలకు సైతం ఇవ్వవచ్చు. జకాత్ ద్వారా వచ్చిన విరాళాలను ఎన్జీఓలు గుర్తించిన నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసర రూపంలో సహాయం అందిస్తారు. హ్యూమానిటీ ఫౌండేషన్, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ వంటి ఎన్జీఓలు తమకు వచ్చిన జకాత్ విరాళాలను రెండు దశాబ్దాలుగా మురికి వాడల్లో నివసించే నిరుపేదలకు నిత్యావసరాలు అందజేస్తున్నారు.

జకాత్ ఏ విధంగా నిర్ణయిస్తారు..

ఒక వ్యక్తి తాను న్యాయబద్ధంగా సంపాదించిన డబ్బు నుంచి కొంత భాగం జకాత్‌కు ఇవ్వాలి. దీని వల్ల ఈ విధంగా జకాత్ ఇవ్వడం వల్ల ఆ వ్యక్తి సంపాదించిన ధనం దివ్య ఖురాన్‌లో చెప్పబడింది. ఎవరి దగ్గరైతే ఏడున్నర తులాల బంగారం, లేదా యాభై రెండు తులాల వెండి లేదా దానికి సమానంగా ధనం కలిగిన వారు దానిపై ప్రతి ఏడాది రెండున్నర శాతం జకాత్‌కు కేటాయించాలి. స్థిరాస్తిలో వచ్చే ఆదాయం ఎప్పటికప్పుడు ఖర్చు అయిపోతుంటే దానికి జకాత్ వర్తించదు. అదే విధంగా లక్ష రూపాయలకు మించిన బంగారం, ఇతర ఆభరణాలు సంవత్సరానికి పైగా ఉంటే దానికి జకాత్ వర్తిస్తుంది. బంగారం కానీ, ఇతర ఆభరణాలు కానీ రంజాన్ నాటికి సంవత్సరం పూర్తికాకపోతే వాటికి జకాత్ మినహాయింపు ఉంటుంది. బంగారు ఆభరణాలు తూకం వేయడంలో, స్థిరాస్తులపై ఉన్న నగదు లెక్కింపులో పారదర్శకత పాటించాలి.

జకాత్ వల్ల పేదలకు మేలు..

బంగారం, ఇతర ఆదాయాల మీద జకాత్ తీసిన వారిని అల్లా ఎంతగానో ప్రేమిస్తారు. జకాత్‌ను పంపిణీ చేయడంలో నియమాలను పాటించాలి. జకాత్ సాయం అర్హులైన నిరుపేదలకే అందించేలా చూడాలి. వికలాంగులు, నిరుపేదలకు ప్రాధాన్యమివ్వాలి.

– సయ్యద్ మతీన్ అలీషాఖాద్రి, ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు

ఆర్.ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో..



చార్మినార్: రంజాన్ మాసంలో పాతబస్తీ ఈదిబజార్‌లోని రెడ్ రోజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ జకాత్ కార్యక్రమంలో భాగంగా పేదలకు నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ కిట్లను ఉచితంగా అందజేస్తున్నారు. సోనామసూరి బియ్యం, గోధుమ పిండి, ఎర్రపప్పు, కందిపప్పు, మంచినూనె, చక్కెర, టీ పౌడర్, ఖర్జూరం, సేమియా డ్రై ఫ్రూట్స్.. ఇలా 21 నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను అందజేస్తున్నారు. ఈదిబజార్‌లోని ఆర్.ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయం ప్రతిరోజూ పేదలతో కిటకిటలాడుతోంది. ఆర్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సయ్యద్ హమీదుద్దీన్ పర్యవేక్షణలో సోమవారం రంజాన్ కిట్ల పంపిణీ కొనసాగింది.



రంజాన్ కిట్లను అందజేస్తున్న సయ్యద్ జీషానుద్దీన్

రోటీఫర్ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం...

2018 నుంచి రోటిఫర్‌ను ప్రారంభించి పేదలకు ప్రతిరోజూ నిత్యాన్నదానం చేస్తున్నాం. రంజాన్ మాసంలో ప్రతిరోజూ కిట్ల పంపిణీని కొనసాగిస్తున్నాం. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ఏర్పడిన లాక్‌డౌన్‌లో ఇంటింటికీ నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశాం.

నేడు మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌గౌడ్, శివముదిరాజ్

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావుపూలే 197వ జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున్‌గౌడ్, పిట్టల శివముదిరాజ్ వెల్లడించారు. సోమవారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజేంద్రనగర్ జూనియర్ కళాశాల ఆవరణలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మ జ్యోతిరావుపూలే జయంత్యోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు హాజరవుతారన్నారు.

ఈర్ల చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

- నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



పనులను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు అభివృద్ధి, సుందరీకరణ, నాలా విస్తరణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఈర్ల చెరువును దత్తత తీసుకున్న విషయం తెలిసిందన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి పురోగతి సాధించాలన్నారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతి, డీఈ స్రవంతి, ఏఈ ప్రతాప్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అనునిత్యం కృషి చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంత్యోత్సవ కమిటీ అధ్యక్షులు పలుగుచెరువు మహేష్, ప్రధాన కార్యదర్శి బి.టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో అందరు నడవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కోశాధికారి మంగళారం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు వనం నర్సింహ్మామాదిగ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలి

గోల్కొండ: కార్వాన్ పంచ్‌భాయ్ అలావా దత్తాత్రేయ ఆలయ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయని, ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె వేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు విద్యుత్ శాఖ ఏఈకు సోమవారం వినతిపత్రం అందించారు. పంచ్‌భాయ్ అలావా మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆలయ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, ఇక్కడ పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగి రోడ్డు వైపు వచ్చాయని వినతిపత్రం పేర్కొన్నారు. కాగా ఇక్కడ పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో పరిసరాల ఇళ్ల వారు చెత్త, ఇతర వ్యర్థాలను తెచ్చి ఇక్కడే డంపింగ్ చేస్తున్నారన్నారు. దీనివల్ల ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారిందని ఆలయానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సమస్యలకు త్వరలో పరిష్కారం



డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీ సంఘం సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతూ సమస్యలు లేకుండా చూస్తున్నామని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి వెల్లడించారు. భాగ్యనగర్ కాలనీ ప్లాట్స్, హౌస్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీసీజీ చారి ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

వెస్ట్ జోనల్ కమిషనర్‌తో ట్రాఫిక్‌పై చర్చించిన అధికారులు



జోనల్ కమిషనర్ శంకరయ్యతో సమావేశమైన ట్రాఫిక్ పోలీసులు, ఎస్ఆర్‌డీపీ అధికారులు

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ఎదురయ్యే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఫ్లై ఓవర్ నిర్మాణం, ట్రాఫిక్ సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. గచ్చిబౌలి జంక్షన్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి కొండాపూర్ వైపు మరో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు జరుగుతున్న క్రమంలో గచ్చిబౌలి జంక్షన్ మీదుగా వెళ్లే ఫ్లై ఓవర్ రాడిసన్ హోటల్ వద్ద ల్యాండ్ అయ్యే అవకాశం ఉంది. పిల్లర్ల నిర్మాణం చేపడితే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఎస్ఆర్‌డీపీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి రాడిసన్ హోటల్ వరకు రెండు వైపులా వాహనాల రాకపోకలను నిలిపివేయాలని భావిస్తున్నట్లు జోనల్ కమిషనర్‌కు తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా అంజయ్యనగర్ నుంచి క్యూమార్ట్ వరకు రోడ్డు విస్తరించాలని సూచించారు. గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే రోడ్డును మూసి వేస్తే ట్రిపుల్ ఐటీ నుంచి రాడిసన్ హోటల్, రాంకీ రోడ్డును పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా మరమ్మత్తులు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు. సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేసిన అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని జోనల్ కమిషనర్ శంకరయ్య వెల్లడించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హన్మంత రావు, గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ నవీన్, ఎస్ఆర్‌డీపీ అధికారులు ఉన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారు... వారికి ప్రేమతో పనిచేసి వారి రుణం తీర్చుకుంటాను.. అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి నియోజకవర్గంగా నిలిపి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ అధ్యక్షతన నార్సింగి మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం సైతం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ పత్తి ప్రవీణ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, వైస్ చైర్మెన్ వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

కంటి వెలుగుతో ఎంతో మేలు



మణికొండ గార్డన్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

మణికొండ: రాష్ట్ర ప్రజలందరి మేలు కోరి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకంలో ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని తన 19వ వార్డు మణికొండ గార్డన్ కమ్యూనిటీ హాల్‌లో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లోపించటంతో అనేక కంటి సమస్యలు వస్తున్నాయన్నారు.

బలగం నటుడికి సన్మానం.. ఆర్థిక సాయం

శంషాబాద్: ఇటీవల ప్రజాదరణ పొందిన బలగం సినిమాలో గ్రామ సర్పంచ్ పాత్రలో నటించిన శంషాబాద్ పట్టణం సిద్దాంతి బస్తీకి చెందిన నటుడు సహదేవ్ ఎస్‌వీజీ గ్రూప్ సంస్థ యజమానులు సన్మానించి కొంత ఆర్థిక సాయాన్ని అందజేశారు. పదహారేళ్లగా వివిధ సినిమాల్లో సహనటుడిగా పాత్రలు పోషిస్తున్న సహదేవ్ భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ చిత్రాల్లో మంచి పాత్రలు పోషించి శంషాబాద్‌కు మంచిపేరు తీసుకురావాలని సంస్థ ఎండీ గిరిబాబు ముదిరాజ్, డైరెక్టర్ సురేష్‌లు అభిలషించారు.



బలగం నటుడు సహదేవ్‌ను సన్మానిస్తున్న ఎస్‌వీజీ గ్రూప్ యజమానులు గిరిబాబు, సురేష్

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: వేసవి కాలంలో ప్రజలకు మంచి నీటిని అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన మంచినీటి పైపులైన్ మరమ్మత్తు పనులను ఆయన అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మంచినీటి సరఫరా పైపులైన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో నీటి సరఫరా జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కేశవనగర్ కాలనీ, ఎర్రబోడ, నలందానగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా అసలు జరగడం లేదన్నారు. ఈమేరకు రాజేంద్రనగర్ జలమండలి జీఎం చంద్రశేఖర్, డీజీఎం జమీల్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మూల శ్రీనివాస్‌గౌడ్, సాయియాదవ్, ఉపేందర్‌రెడ్డి, కాకుళారం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. సర్వే నెంబర్ 7, 111, 46లలో స్థలాల్లో కొందరు నిర్మాణాలను చేపట్టారు. ఈ విషయమై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్వహకులకు నోటీసులు ఇచ్చారు.

బీజేపీ నేతకు పరామర్శ

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకుడు రావుల భాస్కర్‌ను సోమవారం జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి పరామర్శించారు. గత వారం యువకుల దాడిలో రావుల భాస్కర్ గాయపడ్డ విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి వచ్చిన ఆయనను అధ్యక్షులు సామ రంగారెడ్డి నాయకులతో కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



రావుల భాస్కర్‌ను పరామర్శిస్తున్న జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి

రాజేంద్రనగర్‌లో సహపంక్తి భోజనాలు



రాజేంద్రనగర్‌లో సామూహిక భోజనాలు చేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్ర మహిళా మోర్చా పిలుపు మేరకు సామాజిక న్యాయం(ఏప్రిల్ 6 నుంచి 14వ తేదీ) వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు గడిల పద్మావతి అధ్యక్షతన రాజేంద్రనగర్ ఆశావర్కర్ తీగల మీనా ఇంట్లో సామూహిక భోజనాలు చేశారు. రంగారెడ్డి (అర్బన్) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రాజేంద్రనగర్‌లో రంజాన్ కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్: ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రంజాన్ కానుకగా బట్టలు పంపిణీ చేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్‌లకు చెందిన పేద ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే రంజాన్ బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రంజాన్ కానుకలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన, డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రేమ్‌గౌడ్, నయిం, ముర్తుజా అలీ, ముజామిల్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.